ప్రజాశక్తి

బుధవారం 25 జూన్ 2025 · 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి

త్వరలో రూ.850 కోట్లతో టెండర్లు

● ఎంపి కేశినేని శివనాథ్ ● 'సుపరిపాలనలో తొలి అడుగు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ రైల్వేస్టేషన్‌ను రూ.850 కోట్లతో అభివృద్ధి చేసేందుకు త్వరలో టెండర్లు పిలవనున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. దీనిలో భాగంగా గుణదల వద్ద రెండు ఆర్‌ఒబిలు, మాచవరం వద్ద ఒక ఆర్‌ఒబి నిర్మిస్తామన్నారు. వచ్చే ఏడాదిన్నర కాలంలో మొత్తం ఎనిమిది ఆర్‌ఒబిలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎంపీగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఏడాది కాలంలో చేసిన అభివద్ధి కార్యక్రమాలకు సంబంధించి "సుపరిపాలనలో తొలి అడుగు" పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ విజయవాడ అభివద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. అమత్ భారత్ కింద గుణదల, రాయనపాడు రైల్వేస్టేషన్ల అభివద్ధి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం కాబోతున్నాయన్నారు. జాతీయ రహదారులతో పాటు 6.3 కిలోమీటర్ల మహానాడు రోడ్ నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు చెప్పారు. గొల్లపూడి వెస్ట్రన్ బైపాస్ కూడా జాతీయ రహదారిగా నిర్మాణం జరుగుతోందన్నారు. రైతులను ఒప్పించి భూ సేకరణ చేసి బైపాస్ రోడ్ నిర్మించామన్నారు. విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. ఆటోనగర్ వైపు అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 24 గంటలూ ఆటోనగర్లోకి లారీలు వచ్చేలా చేస్తున్నామన్నారు. కాల్వలు ఉన్న ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చెస్తున్నామని చెప్పారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేలా, పిల్లలు ఆడుకునే వాతావరణం కల్పిస్తామని తెలిపారు. దుర్గగుడి వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేస్తున్నామని తెలిపారు. గుడికి వచ్చే వారికి వెయిటింగ్ హాళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. రెండేళ్లల్లో వచ్చే కష్ణా పుష్కరాల సందర్భంగా ఇప్పటి నుంచే రోడ్లు, ఘాట్ల అభివద్ధిపై దృష్టి పెడతామన్నారు. ఆటోనగర్లో లక్ష మంది కార్మికులు పని చేస్తున్నారని, వీరికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విమానాలు నడిపేలా అడుగులు వేస్తున్నామని తెలిపారు. విజయవాడలో డ్రైనేజీ, మంచినీటి సమస్యలు లేకుండా డిపిఆర్ సిద్ధం చేశామన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని శాప్‌కు అప్పగించి ఖేలో ఇండియా కింద నిధులు మంజూరు చేశామని తెలిపారు.

కౌన్సిలంటే లెక్కలేదా?

● అధికారుల తీరుపై సభ్యులు గరంగరం ● సమాచారం లేకుండా అజెండాలోకి అంశాలు తీసుకురావడంపై ఆగ్రహం
● ఆస్తుల రీ సర్వే సర్క్యులర్ రద్దు తీర్మానించాలి : సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు
● పలువురు వైసిపి కార్పొరేటర్ల మద్దతు ● పోస్టుల భర్తీకి తీర్మానించాలని విజ్ఞప్తి

అధ్యక్ష స్థానంలో ఉన్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి; అంతర్‌చిత్రాల్లో టిడిపి, సిపిఎం, వైసిపి ఫ్లోర్‌లీడర్లు నెలిబండ్ల బాలస్వామి, బోయి సత్యబాబు, అరవ సత్యనారాయణ; కౌన్సిల్ బయట సత్యబాబు నిరసన (పక్కన)

ప్రజాశక్తి - విజయవాడ : అధికార వైసిపి పాలకపక్షానికి, అధికారులకు మధ్య లోపించిన సమన్వయం, అజెండా రూపకల్పనలో గందరగోళం నేపథ్యంలో విఎంసి కమిషనర్ ప్రవేశపెట్టిన పలు అంశాలను విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదా వేసింది. విఎంసి అధికారుల వైపు నుండి తీసుకొచ్చిన పలు అంశాలను చర్చకు కూడా పెట్టకుండా తదుపరి సమావేశానికి వాయిదా వేస్తున్నట్లు అధికారపక్షం ప్రకటించింది. కౌన్సిల్‌లో పాలకపక్షమన్నా, కార్పొరేటర్లన్నా అధికారులకు కనీస విలువ లేకుండా పోయిందని, కాంట్రాక్టర్ల లాభాపేక్ష కోసం ఆఫీసు వైపు నుంచి తీసుకొచ్చిన అంశాలను తాము అంగీకరించేది లేదని సీనియర్ వైసిపి కార్పొరేటర్ బండినాగేంద్ర పుణ్యశీల మండిపడ్డారు. ఇదే అభిప్రాయాన్ని అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ మేయర్ బెల్లందుర్గతోపాటు మరో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైసిపి ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ, ఆపార్టీ కార్పొరేటర్లు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మూకుమ్మడిగా వ్యక్తం చేశారు. సమావేశం ముగింపు దశలో 88 (కె)ను అనుసరించి నగర కమిషనర్ ద్వారా ప్రవేశపెట్టిన 151 నుంచి 156వ అంశం వరకు చర్చకు పెట్టకుండా వాయిదా వేశారు. విజయవాడ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఉదయం సెషన్ వరకు మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షత వహించగా, భోజనం అనంతరం డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ అధ్యక్షత వహించారు. సెక్షన్ 88 (జె) ననుసరించి సప్లమెంటరీ అజెండాలోని కమిషనర్ ప్రవేశపెట్టబడిన 127వ అంశం నుంచి 148వ అంశం వరకు, అలాగే 88(కె) కింద 149వ అంశం నుంచి 156వ అంశం వరకు అత్యంత విలువైన, ఖర్చుతో కూడుకున్న వాటిని అధికారపక్షానికి సంబంధించి ఏ ఒక్కరి కార్పొరేటర్‌కు కనీసంగా కూడా తెలపకుండా ఏకపక్షంగా అధికారులు తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటని

(మిగతా 2లో)

మలి విడత భూ సమీకరణకు పచ్చజెండా

మంత్రివర్గం ఆమోదంతో త్వరలో నోటిఫికేషన్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతి నిర్మాణం నిమిత్తం మరోసారి భూసమీకరణ జరపాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. మంగళశారం జరిగిన మంత్రివర్గం సమావేశంలో రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కోసం రెండో విడత 44 వేల ఎకరాలను వివిధ ప్రాంతాల్లో సమీకరించాలని నిర్ణయించింది. సమావేశం అనంతరం రాష్ట్ర సమాచార, పౌరసంబంధశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దష్టిలో పెట్టుకొని 2015లో చేపట్టిన సమీకరణకు ఉన్న నిబంధనల మేరకే రెండో విడత సమీకరణ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీంతో ఇప్పటి వరకు అధికారిక ప్రకటన లేదని కొంత మంది రైతులు అయోమయంలో ఉన్నా ప్రభుత్వం నేరుగా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడంతో మలివిడత సమీకరణకు పచ్చజెండా ఊపినట్లయింది. ప్రపంచ స్థాయి సంస్థల ఏర్పాటు, విద్య, వైద్య, ఇతర మౌలిక వసతుల కల్పనకు భూ సమీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. యూనిఫార్మ్ ప్రేమ్ వర్కుతో ల్యాండ్ పూలింగ్ చేయాలని తలపెట్టింది. ప్రధానంగా 2014లో రూపొందించిన భూ సమీకరణ చట్టానికి అనుబంధంగా 2025 భూ సమీకరణ చట్టానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రెండో విడత భూ సమీకరణకు 44 వేల ఎకరాలకు ప్రతిపాదనలు చేయగా కొంత మంది రైతులు సానుకూలంగా ఉండగా, మరికొంత మంది వ్యతిరేకిస్తున్నారు. తాడికొండ, తుళ్లూరు, అమరావతి మండలాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రైతులు పలు సందేహాలు వ్యక్తం చేశారు. అయితే అమరావతి ప్రాంతంలో పెట్టుబడులు రావాలంటే 5 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం అవసరమని, నూతన రైల్వే లైను, అంతర్జాతీయ క్రీడానగరం, స్మార్టు ఇండస్ట్రీస్ కోసం 44 వేల ఎకరాలు అవసరమని అధికారులు చెబుతున్నారు. రాజధానిలో 2015లో చేసిన భూ సమీకరణ పరిధి 217 చదరపు కిలో మీటర్లే ఉంది. నిబంధనల పరిధిని పెంచేందుకు రెండోవిడత భూ సమీకరణ చట్టసవరణకు మంత్రి మండలి ఆమోదంతో త్వరలో అధికారికంగా గ్రామాల వారీగా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. మలివిడత భూ సమీకరణలపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని దాదాపు నాలుగు మండలాల్లోని 20 గ్రామాల్లో భూ సమీకరణ జరగనుంది. రాజధానికి సమీపంలో ఉన్న మండలాల్లో రోడ్డు పక్కన భూములకు అధిక ధరలు ఉండటం, లోపల భూములకు తక్కువ ధరలు ఉండటం వల్ల ఇద్దరికి ఒకే ప్యాకేజి ఎలా అని పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు తమకు కూడా 29 గ్రామాల పరిధిలోనే రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని, కౌలు తక్షణం రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పదేళ్ల క్రితం 29 గ్రామాల్లో 30 వేల మంది రైతుల నుంచి తీసుకున్న భూములకు ఇంత వరకు అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇవ్వలేదని, ముందు వారి సంగతి చూడండని కొంత మంది రైతులు గ్రామసభల్లో తమ వాదన వినిపించారు.

నేడు కెయు స్నాతకోత్సవం

హాజరుకానున్న గవర్నర్ నజీర్

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం 6, 7, 8 స్నాతకోత్సవం బుధవారం మచిలీపట్నంలో నిర్వహించనున్నట్లు విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ తెలిపారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్, కష్ణా విశ్వవిద్యాలయ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్, గౌరవ అతిథిగా మానవ వనరుల అభివద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 నుండి 4.45 గంటల వరకు అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవంలో కష్ణాజిల్లాకు చెందిన ఎన్‌ఎస్‌ఎల్ గ్రూప్ చైర్మన్ మండవ ప్రభాకరరావు, అమెరికాలోని అలబామా విశ్వవిద్యాలయం ట్రాన్సేషన్ మెడిసిన్ విభాగ ఆచార్యులు ఎంఎన్‌వి రవికుమార్, గ్రీన్కో సంస్థ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి చలమలశెట్టి అనిల్ కుమార్‌లకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే 21 మందికి గోల్డ్ మెడల్స్, 63 మందికి పిహెచ్‌డిలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. తొలుత క్యాంపస్‌లో నిర్మించిన ఫుడ్‌కోర్టును ప్రారంభించిన తరువాత కాన్వకేషన్‌లో గవర్నర్ పాల్గొంటారని తెలిపారు. మీడియా సమావేశంలో రిజిస్ట్రార్ ఎన్.ఉషా, పరీక్షల నియంత్రణాధికారి పి.వీరబ్రహ్మాచారి, ప్రొఫెసర్లు సుశీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జెసి గీతాంజలి శర్మ, విసి ఆచార్య కే రామ్‌జి

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

గవర్నర్ పర్యటన ఏర్పాట్లను మంగళవారం కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే రామ్‌జి పరిశీలించారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. తొలుత గవర్నర్ ప్రారంభించనున్న ఫుడ్ కోర్టును పరిశీలించారు. అనంతరం వైయస్సార్ పరిపాలనా భవనంలో ఉప కులపతి చాంబరు, దానికి ఎదురుగా ఉన్న సెనేట్ హాలును పరిశీలించారు. తదుపరి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ బ్లాక్ భవనం వద్ద గ్రీన్ రూమ్ ఏర్పాట్లు, అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో వేదిక, వీఐపీ, అతిథులు, ప్రముఖులు మీడియా తదితరుల సీటింగ్ ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ పర్యటనలో ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, అదనపు ఎస్పీలు వివి నాయుడు, సత్యనారాయణ, విశ్వవిద్యాలయం రిజిస్టర్ ఆచార్య ఉష, ఎస్సీ సంక్షేమ అధికారి షాహిద్ బాబు పాల్గొన్నారు.

కలెక్టర్ లక్ష్మీశకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిఐపిఆర్‌ఓ కె.వి. రమణరావు, చిత్రంలో డిపిఆర్‌ఓ ఎస్.వి.మోహన్ రావు, డివిజనల్ పిఆర్‌ఓ కె.రవి, ఎ.వి.ఎస్.వి.వి.రవి, ప్రసాద్

కలెక్టర్‌ను కలిసిన డిఐపిఆర్‌ఓ రమణరావు

ప్రజాశక్తి - విజయవాడ : సమాచార పౌర సంబంధాల శాఖ ఎన్‌టిఆర్ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె.వి.రమణారావు మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసారు. ఏలూరు జిల్లా నుండి బదిలీపై వచ్చిన రమణారావు ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న యు.సురేంద్రనాథ్ నుండి బాధ్యతలు తీసుకున్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డిపిఆర్‌ఓ ఎస్.వి.మోహన్ రావు, డివిజనల్ పిఆర్‌ఓ కె.రవి, ఏవీఎస్ వి.వి.ప్రసాద్ ఉన్నారు.

సిసి కెమెరాలకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేర రహిత నగరంగా విజయవాడను తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు చెప్పారు. పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని 9 కాలనీల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్‌సీ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, ఏసీపీ దామోదరరావు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపి శివనాథ్, ఎంఎల్ఎ గెద్ద, సిపి రాజశేఖరబాబు

యుపిఎస్‌సి శిక్షణకు

కండెల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ ప్రారంభం

విజయవాడ : ఆల్ ఇండియా సర్వీసుల ఉద్యోగాలకు శిక్షణ ఇచ్చే నిమిత్తం కండెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కండెల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ యుపిఎస్‌సి అనే పేరుతో నూతన శిక్షణ సంస్థను మంగళవారం రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ విజయవాడ చుట్టుపక్కల జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన అభ్యర్థులు శిక్షణ కోసం దూరప్రాంతాలకు వెళ్లి అనేక వ్యయ ప్రయాసలు పడకుండా తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేవిధంగా ఈ శిక్షణ సంస్థ ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందే అభ్యర్థులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరీక్షల్లో వచ్చే మార్పులను తెలియజేస్తూ వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. సంస్థ డైరెక్టర్ కండెల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ నుండి పేద, మధ్యతరగతి విద్యార్థులను, యూపీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇచ్చి తక్కువ ఖర్చుతో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి తమ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, రిటైర్డు అధికారుల సలహాలు ఎప్పటికప్పుడు స్వీకరించి వారి ద్వారా శిక్షణ అందిస్తామని చెప్పారు. అంతేగాకుండా పేరు ప్రఖ్యాతలు గల వివిధ సబ్జెక్టులలోని ఫ్యాకల్టీల ద్వారా నాణ్యమైన శిక్షణ అందజేస్తామని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఇంకా షెడ్యూల్డ్ కులాల అభివద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణవేణి, విజయవాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, సిద్ధార్థ ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ రాజారావు పాల్గొన్నారు.

ఇనిస్టిట్యూట్ ప్రారంభోత్సవంలో ఇంతియాజ్, కండెల్లి సుధీర్, కృష్ణవేణి తదితరులు

డంపింగ్ యార్డు రహిత రాష్ట్రమే లక్ష్యం : పట్టాభి

ప్రజాశక్తి - విజయవాడ : డంపింగ్ యార్డ్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా రెండు క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎంఎల్ఎలు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), కొలికపూడి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, కొండపల్లి మున్సిపల్ కమిషనర్లతో నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం పట్టాభిరామ్ సమావేశం నిర్వహించారు.

ప్రతి మండలానికీ నైపుణ్య శిక్షణా కేంద్రం : ఎంపి

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతి మండలంలో స్థానిక పారిశ్రామిక అవసరాలు, అభివద్ధికి దోహదంచేసే వనరులను దష్టిలో ఉంచుకొని నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నగరంలోని కలెక్టరేట్లో ఎంపి అధ్యక్షతన జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, జగ్గయ్యపేట, తిరువూరు ఎంఎల్ఎలు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు హాజరైన ఈ సమావేశంలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతి, భవిష్యత్తు కార్యాచరణ, సమస్యల గుర్తింపు, పరిష్కారానికి చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, సీపీవో వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఈవో డీఎంఎఫ్ విజయకుమారి, డ్వామా పీడీ ఎ.రాము, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, హౌసింగ్ పీడీ పి.రజనీకుమారి, డీఈవో యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణలో అప్రమత్తం : విఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : విపత్తు నివారణ చర్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. కృష్ణలంకలో ఆయన మంగళవారం పర్యటించారు. నేతాజీ బ్రిడ్జి ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విపత్తు నివారణ చర్యల్లో భాగంగా కష్ణానది వద్ద ఉండే కష్ణలంక ప్రాంతం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి కష్ణలంక ప్రధాన రహదారి, సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీటి సరఫరా ఆహారంలో నాణ్యత పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE VIITH ADDITIONAL DISTRICT JUDGE AT VIJAYAWADA
O.S.No. 16/2020
Between
1. Allu Lakshmana Rao & 7 others ... Plaintiffs
And
1. Allu Yedukondala Venkateswarlu @ Kondala Rao & 8 Others ... Defendants
To,
Defendant No. 5:
Dasari Venkateswara Rao
S/o. Krishna Murthy, Aged about 60 years
Resident of D.No. 23-11-1/6D,
Ogiralavari Street, Satyanarayanapuram,
Vijayawada-2.
Take notice that in O.S.No. 16/2020 the Hon'ble VII Additional District Judge Court, Vijayawada was pleased to order summons to you through paper publication returnable on 16.07.2025. Be present either in person or through an Advocate before the Hon'ble VII Additional District Judge Court, Vijayawada on 16.07.2025 at 10.30 A.M, failing which the matter will be decided in your absence.
Syed Shaji Sultan Moosavi
Advocate for the Plaintiffs
Vijayawada, 24.06.2025

పేరు మార్పు / సవరణ
నేను మేరి సిస్టర్ ఫీలిక్స్ ఆన్ పిటి, D/o తోమన్‌కుట్టి (MARY SISTER FELIX ANN P T, D/o THOMAN KUTTY), నివాసం : 43-101-6/1, పి&టి కాలనీ, సెంట్ ఆన్స్ హెల్త్ సెంటర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ.
ప్రస్తుతం నా ఆధార్‌లో నా పేరు మేరి సిస్టర్ ఫీలిక్స్ ఆన్ పి టి అని నమోదు కాబడినది. ప్రస్తుతం నా పేరును మార్పు చేయగా **పఠ్రయాట్టిల్ తోమన్‌కుట్టి మేరి** D/o **తోమన్‌కుట్టి (PAZHAYATTIL THOMANKUTTY MARY D/o THOMAN KUTTY)** అని పాస్‌పోర్టు ప్రకారం మార్పు చేయుట జరిగినది. కావున నేటి నుండి నా పేరును **పఠ్రయాట్టిల్ తోమన్‌కుట్టి మేరి**గా పిలవబడును.
From today onwards my name will be called and known as **PAZHAYATTIL THOMANKUTTY MARY**

కౌన్సిలంటే లెక్కలేదా?

(మొదటి పేజీ తరువాయి)

పలువురు అధికార పార్టీ సభ్యులు ప్రశ్నించారు. తమ తమ డివిజన్లలోని సమస్యలకు సంబంధించిన అంశాలను అజెండాలోకి తీసుకొచ్చే ముందు కనీసం సభ్యులకు కూడా చెప్పాల్సిన పని లేదా అని అధికారులపై మండిపడ్డారు. 127 నుంచి 148 అంశం వరకు జరిగిన చర్చలో ఎవరి ప్రమేయంతో ఈ అంశాలను ప్రవేశపెట్టారని ఆయా విభాగాల ఉన్నతాధికారులను సభ్యులు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆస్తి పన్ను పెంపు రీ సర్వే సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ రాజకీయాలకతీతంగా కౌన్సిల్ తీర్మానించి ప్రభుత్వానికి పంపించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ సర్క్యులర్ అమలైతే ప్రభుత్వం నిర్దేశించిన రూ.40 కోట్ల భారానికి అదరంగా దాదాపు రూ.80 కోట్లకుపైగా భారం నగరంలోని గృహ యజమానులపై పడుతుందన్నారు. అంతేగాకుండా పరోక్షంగా ఈ భారం అద్దెదారులపైనా పడుతుందని సత్యబాబు అన్నారు. 198 జీఓ ప్రకారం ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని తీసుకొచ్చి ప్రతిఏటా 15 శాతం పెంచడానికి వీలుగా గత వైసిపి ప్రభుత్వం అమలు చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 20 శాతం తగ్గకుండా ఆస్తి పన్ను పెంచడానికి వీలుగా తీసుకొచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. కొండలపైన ఉన్న చిన్నపాటి ఇళ్లకు, దిగువ నున్న గృహాలకు ఒకే పన్ను వేస్తున్నారని, ఈ సర్క్యులర్ వల్ల ఇబ్బందులు తప్పవని వైసిపి కార్పొరేటర్ అమరనాథ్ తన డివిజన్‌లోని అనుభవాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. చివరకు ఇదే అంశం సభ్యుల మధ్య పెద్దఎత్తున చర్చకు దారి తీసింది. దీనిపై విఎంసి డిసిఆర్ సృజన సమాధానం ఇస్తూ ఈ సర్క్యులర్ వలన ప్రత్యేకించి పన్ను పెంపు అనేది లేదని, ప్రతి ఏటా జరిగే విధంగానే ఎక్కడైతే అక్రమ నిర్మాణాలు ఉంటాయో వాటిపైనే పన్ను వేస్తారని చెప్పారు. ఇప్పటి వరకు గత మూడు మాసాల్లో రూ.2 కోట్ల వరకు అదనంగా పన్నులు పెంచినట్లు చెప్పారు. విఎంసి అదనపు కమిషనర్ (జనరల్) ఎసిజి దగ్గర నుంచి సిఎంఓహెచ్, ఇతర ముఖ్యమైన విభాగాల్లోని అధికారులు, ఇఇలు, ఎఇలు, మున్సిపల్ కార్మికులు ఇలా ప్రతి స్థాయిలో ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ చేయనందున పాలన అస్తవ్యస్తంగా తయారైందని, వెంటనే పోస్టుల భర్తీకి కౌన్సిల్ తీర్మానించి ప్రభుత్వానికి పంపాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తీసుకొచ్చిన ప్రతిపాదనపై పార్టీలకతీతంగా సభ్యులంతా మాట్లాడారు. ఆయా విభాగాలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కౌన్సిల్ చేసిన తీర్మానాలను మున్సిపల్ ఎంఎ అండ్ యుడికి పంపకుండా సెక్రటరీ సెల్ బీరువాలోనే ఉంచుతున్నారని టిడిపి సీనియర్ సభ్యులు ముమ్మనేని ప్రసాద్ పేర్కొన్నారు. పోస్టుల భర్తీ అంశంపై తాను పలుసార్లు లేఖ రాసినా ప్రభుత్వానికి పంపడంలేదని స్వయంగా కమిషనర్ తనకు చెప్పారంటూ వైసిపి ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులడిగిన పలు ప్రశ్నలకు అధికారుల నుంచి వచ్చే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నాయని, వచ్చే సమావేశం నాటికి సక్రమంగా సమాధానాలు ఇచ్చే విధంగా ఉండాలని మేయర్ భాగ్యలక్ష్మి అన్నారు. ఆయా విభాగాల ఉన్నతాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులున్నా ఎందుకు ఖర్చు చేయడం లేదని, ఫలితంగా ఆయా డివిజన్లలో చేయాల్సిన అతి ముఖ్యమైన పనులు ఆగిపోతున్నాయని సత్యబాబు అన్నారు. బిటి, సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, ఫలితంగా తొందరుగా దెబ్బతింటున్నాయన్నారు. వేలాది టిడ్కో, జెఎన్ఎన్‌యుఆర్‌ఎం గృహాల నిర్మాణం ఎప్పుడో పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించడంలేదని, దీంతో అవి శిధిలావస్థకు చేరుకుంటున్నాయని సత్యబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై యుసిడి పిఓ సమాధానం ఇస్తూ వచ్చే డిసెంబరు నాటికి 3,792 గృహాలను పంపిణీ చేస్తామని చెప్పారు. కోట్లాది రూపాయల విలువైన విఎంసి స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని సత్యబాబు తీసుకొచ్చిన ప్రతిపాదనపై పార్టీలకతీతంగా సభ్యులంతా మాట్లాడారు. తమ డివిజన్‌లోనే చాలా ఆక్రమణలు జరుగుతున్నాయని స్వయంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే రీతిలో వైసిపి, టిడిపి, సిపిఎం సభ్యులందరూ స్థలాల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌన్సిల్ బయట సత్యబాబు నిరసన
ఆస్తుల రీ సర్వేను ఉపసంహరించుకోవాలని డిమాండ్

రీ సర్వే పేరుతో ఆస్తి పన్ను పెంపుదల చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఎపి టిడ్కో, జెఎన్ఎన్‌యుఆర్‌ఎం గహాలను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నగరపాలక సంస్థకు రావాల్సిన రూ.622 కోట్ల బకాయి నిధులను వెంటనే విఎంసికి విడుదల చేయాలని, అర్హులకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. విఎంసి కౌన్సిల్ సమావేశానికి ముందుగా కౌన్సిల్ హాలు ఎదుట సత్యబాబు నిరసన తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. నగరంలో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణం నిమిత్తం కేంద్రం మంజూరు చేసిన రూ.289 కోట్లను గత నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వంగానీ, ప్రస్తుత సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వంగానీ ఖర్చు చేయలేదన్నారు. దీంతో చిన్నపాటి వర్షానికే నగరంలో రోడ్లు జలమయమవుతున్నాయన్నారు. ఇవే అంశాలను సత్యబాబు కౌన్సిల్ సమావేశంలోనూ ప్రస్తావించారు.

మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
O.S. No. 1260/2023
Between :
Canara Bank, Nidamanuru Branch, Vijayawada. rep by its Asst. Manager .... Plaintiff
And
1) Shaik Adam Shafi S/o Mastan Vali, D.No. 41-1/1-137, Near Apsara Lodge, Krishna Lanka, Vijayawada- 520013.
2) Abdul Jabbar, s/o Abdul Khadar, Prop : Bismilla Tyre, R/o D.No. 18-237, Siddu Nagar, Kanuru, Vijayawada - 520007.
.... Defendants
పై నెంబరు దావా వాది బ్యాంకు వారు మీపై దావా బాకీ రూ.3,13,951-29 పైసలు మరియు ఖర్చులు వగైరాలు రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసివున్నారు. సదరు దావాలో మీకు ఎట్టి అభ్యంతరములు వున్న యెడల తెలుపుకొనే నిమిత్తం ది. 17-7-2025వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట స్వయంగా గానీ, లేక న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.
విజయవాడ.
ది. 23-6-2025 ఇట్లు
శ్రీ దాసు త్రివిక్రమ వ్యాస్
వాది బ్యాంకు తరపు న్యాయవాది,
స్వామివీధి, గాంధీనగర్, విజయవాడ -520003.
సెల్ : 98482 07621

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి : ఎంపి

కన్స్యూమర్ కమిషన్ మీడియేషన్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: వినియోగదారుల హక్కులు, అందుకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమీపంలో ఉన్న జిల్లా వినియోగదారుల ఫోరం కోర్టు ప్రాంగణంలో ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన జిల్లా కన్స్యూమర్ కమిషన్ మీడియేషన్ సెంటర్ భవనాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా వినియోగదారుల కమిషన్ కు మీడియేషన్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఎంపీ నిధులను మంజూరు చేశామన్నారు. న్యాయాధికారుల అభ్యర్ధన మేరకు కోర్టుకు రహదారిని నిర్మించే ప్రతిపాదనపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అదేవిధంగా త్వరలో నగరంలోని జిల్లా కోర్టును సందర్శిస్తామని, బార్ అసోసియేషన్ భవన నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు న్యాయవాదుల సౌకర్యార్థం అత్యుత్తమ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారుల చట్టాలపై ఇటు ప్రజలతోపాటు వస్తు ఉత్పత్తిదారులకు సైతం అవగాహన కల్పించాలని, తద్వారా తప్పిదాలకు ఎటువంటి ఆస్కారం ఉండదన్నారు. అదేవిధంగా నగరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం, స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టామని, త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభిస్తామని ఎంపీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు దొమ్మేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంలో ఎంపీ, జిల్లా కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ కృషి అభినందనీయమన్నారు. ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ అవగాహన లోపంతో వినియోగదారులు తమహక్కులను వినియోగించుకోవడంలో వెనుకబడి ఉన్నారని, సంబంధిత చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. జిల్లా కన్స్యూమర్ కమిషన్ చైర్మన్ నందిపాటి పద్మారెడ్డి మాట్లాడుతూ కక్షిదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మీడియేషన్ సెంటర్ ఇరు వర్గాల మధ్య రాజీ కుదుర్చుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్సీ డిఆర్‌సి రిజిస్ట్రార్ శిరోభూషణం శ్రీనివాస్, జిల్లా కన్స్యూమర్ కమిషన్-2 విజయవాడ చైర్మన్ ఎన్ చిరంజీవి, వినియోగదారుల కమిషన్-1 సభ్యురాలు శ్రీలక్ష్మి రాయల, వినియోగదారుల కమిషన్-2 సభ్యులు ఏవీ రమణ, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు, విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియా ఆగడాలపై నిరసన

ప్రజాశక్తి-మోపిదేవి: అదనపు మట్టి దిబ్బలు పేరుతో ప్రభుత్వం నుండి అనుమతిని పొంది నల్ల మట్టి అక్రమంగా తవ్వి, ప్రజాప్రతినిధి అండతో విచ్చలవిడిగా అమ్ముకుంటూ బీభత్సం సృష్టిస్తున్న మట్టి మాఫియా ఆగడాలు ఉత్తర చిరువోలు లంక గ్రామంలో రోజురోజుకీ అడ్డు అదుపు లేకుండా సాగిపోతున్నాయపి వైసీపీ యువ నేత బడే గౌతమ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూమిని లెవలింగ్ అనే పేరుతో సర్వే నెం.185/3 భూమిలో 45 రోజుల తాత్కాలిక పర్మిట్ తీసుకున్న నడకుదిటి సురేష్‌బాబు అనుమతులతో సంబంధం లేకుండా మట్టిని ట్రాక్టర్లలో ఎత్తి అమ్మకానికి తరలిస్తున్నారని తెలిపారు. మట్టి తవ్వకాల వలన గ్రామ ప్రజలు రోడ్లపైకి రాలేక పోతున్నారన్నారు. భూమి తక్కువ లోతులో తవ్వేలా అనుమతిని తీసుకున్నా ప్రస్తుతం భారీ లోతు తవ్వకాలు జరుగుతున్నాయని, దీని వల్ల ఊట నీరు బయటకు వస్తోందని, స్థానిక రైతుల పొలాలకు చెందిన గట్టులు, మదింపు మార్కులు మాయమవుతున్నాయని తెలిపారు. తక్షణమే తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర చిరువోలు లంక గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, మాజీ నీటి సంఘ అధ్యక్షులు వర్రే బసవరావు, అద్దంకి శేషు పాల్గొన్నారు.

కలెక్టరేట్ పరిపాలనాధికారిగా రాధిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారిగా ఎఎస్ఎన్ రాధిక మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాధిక జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

'చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయాలి'

ప్రజాశక్తి-గన్నవరం: చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని నాగార్జునసాగర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ బాపులపాడు మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సర్వసభ్య సమావేశం హనుమాన్ జంక్షన్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో 3వ జోన్‌కి సాగు నీటిని విడుదల చేయాలని కె.ఆర్.ఎమ్.బి. నీటి విడుదల ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పై ప్రాంతం నుంచి బాపులపాడు మేజర్ పరిధిలోని ఆయకట్టుకు కనీసం త్రాగునీరు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 3వ జోన్ కు త్రాగునీరు విడుదల చేయాలని అసెంబ్లీలో బయట రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్ళి గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు విశేషంగా కషి చేసినప్పటికీ సమయాభావం వలన చివరి ప్రాంతానికి సాగునీరు అందలేదని ఎడమ కాలువ 3వ జోన్ లోని 2.36 లక్షల ఎకరాల అయకట్టుతో పాటు గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, మాచవరం, వేంపాడు మేజర్ కింద 30వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించి గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయవలసిన అవసరం ఉందని అన్నారు, బాపులపాడు మేజర్ 19వ కిలోమీటర్ వేలేరు దగ్గర పోలవరం కుడి కాలువ 124 వ కిలోమీటర్ క్రాసింగ్ దగ్గర అండర్ టన్నెల్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షులు గంపా చిన్న పంగిడేశ్వరరావు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు కడియాల శ్రీనివాసరావు (బండారుగూడెం), గోళ్ల గోపి (వేలేరు), మద్దినేని కోటేశ్వరరావు (గన్నవరం), తమ్మిశెట్టి రాంబాబు (మల్లవల్లి) కాంపిటెంట్ అథారిటీ నూజివీడు ఎన్.ఎస్.పి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. సీతారావమ్మ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఆళ్ల గోపాలకృష్ణ

సిఐటిడితో ఉషారామా ఒప్పందం

ప్రజాశక్తి-ఉంగుటూరు: విద్యార్థులకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించడంలో ముందంజ వేయడమే లక్ష్యంగా ఉషా రామా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కొనసాగుతుందని కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మాం అన్నారు. మంగళవారం సీఐటిడి (సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) హైదరాబాద్‌తో ఉషా రామ ఇంజనీరింగ్ కాలేజీ కి అవగాహనా ఒప్పందం కుదిరిన సందర్భంగా రాంబ్రహ్మాం మీడియాతో మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు సిఎన్సి, సిఏడి, సిఏఎం, 3డి ప్రింటింగ్ టూల్ డిజైన్ వంటి ఆధునిక ఉత్పత్తి సాంకేతిక రంగాల్లో శిక్షణ పొందనున్నారని అన్నారు. పరిశ్రమకు అనుగుణమైన ప్రాజెక్టులు, ఇంటర్నెట్ షిప్పులు, వర్క్ షాపులు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాములు కూడా ఈ ఒప్పందం ద్వారా అమల్లోకి వస్తాయని. సీఐ టీడీ ఒప్పందం ద్వారా పరిశ్రమ అవగా అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వగలుగుతామని, ఒప్పందం అనంతరం విద్యార్థుల నైపుణ్యాభివద్ధికి ఉపయోగకరమైన అవకాశాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వి కె ఎస్ వి ప్రసాద్, మెకానికల్ శాఖాధిపతి డాక్టర్ ఎస్ మధుసూదన్, ఒప్పందం సమన్వయకర్త డాక్టర్ ఆర్ భార్గవి, సిఐటిడి తరపున ప్రిన్సిపాల్ డైరెక్టర్ డాక్టర్ టి విజయ్ కృష్ణకాంత్, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు ఇంజినీరింగ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-పామర్రు

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హామీ ఇచ్చారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మండలంలోని సచివాలయాలకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తమకు రావలసిన ఇంక్రిమెంట్లు, జీతం పెంపుదల, బదిలీ విషయాలలో ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.ఆయన కోరారు.

డిపాజిటర్ల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఉంగుటూరు: డిపాజిటర్లకు తమ హక్కులు వాటి రక్షణ చర్యలపై కనీస అవగాహన అవసరమని కెరీర్ కౌన్సిలర్ అండ్ యువత సాధికారిత నిపుణులు రిసోర్స్ పర్సన్ నెల్లిబోయిన కాళహస్తి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సాధికార కార్యాలయంలో డిపాజిటర్లకు ఎడ్యుకేషన్ అవగాహన కోసం సమీకృత గ్రామీణ గిరిజన అభివృద్ధి సేవా సంస్థ, మరియు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఆర్డిడ్ కార్యదర్శి యర్రు సాంబశివరావు అధ్యక్షతన వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళహస్తి మాట్లాడుతూ ఆర్బిఐ నియమాలు, ప్రభుత్వ పథకాలు, రకరకాలుగా అందిస్తున్న రుణాలు, సబ్సిడీపై రుణాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణ తదితర అంశాలపై మహిళలకు స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నారు. సమావేశంలో పాల్గొన్న మహిళలతో ప్రత్యక్షంగా పరస్పర సంభాషణ ద్వారా సందేహాలను నివృత్తి చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిపాజిటర్ల హక్కులు, బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ మోసాలు, కేవైసీ అవసరాలు, పొదుపు అవసరం, డార్మెంట్ ఖాతాల ప్రమాదాలు, మహిళల స్వయం సహాయక సంఘాలు, మైక్రో ఫైనాన్స్ భీమా పథకాలు, అటల్ పెన్షన్ యోజన క్రెడిట్ స్కోర్, రైతులకు పంట రుణాలు, పీఎం కిసాన్ పంటల బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ మాజీ బ్యాంకు మేనేజర్ రావూరి శివశంకరరావు, షేక్ హుస్సేన్, డిఆర్డిఏ సహాయ ప్రాజెక్టు మేనేజర్ భూపతి, మహిళా సంఘాల కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాళహస్తి

వల్లూరుపల్లి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పామర్రు: కృష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక పాలసీతల కేంద్రం కళ్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్‌ను కట్ చేసి గణేష్‌కు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో పాల్గొన్న విక్రమ్, కళాశాల యాజమాన్యం, సిబ్బంది

పరిశోధనలతో నాణ్యమైన బోధన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సాధారణ బోధనకు అదనంగా అధ్యాపకులు పరిశోధన దృక్పథాన్ని పెంచుకోవాలని, అప్పుడే బోధనలో నాణ్యత పెరుగుతుందని విక్రమ్ పబ్లిషర్స్ అధినేత రావిక్రింది శ్రీనివాస విక్రమ్ అన్నారు. కెబిఎన్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'రీసెర్చ్ మెథడాలజీ అండ్ ఐపిఆర్' పుస్తకావిష్కరణ సభ మంగళవారం కెబిఎన్ కాలేజీలో జరిగింది. పుస్తకావిష్కరణ చేసిన విక్రమ్ మాట్లాడుతూ విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక విప్లవాన్ని ఉపయోగించుకుని బోధన నైపుణ్యాలు పెంచుకోవటం, పరిశోధన పత్రాలు రాయడం వంటి అంశాలను సమగ్రంగా ఈ పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. పరిశోధన, మేధో సంపత్తి హక్కులు పొందడం అధ్యాపకుల నైపుణ్యాలకు గీటురాయి అన్నారు. పుస్తక రచయిత, కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పరిశోధనకు అంశాన్ని ఎంపిక చేసుకోవడం నుంచి భవిష్యత్ పరిశోధనలకు చేయాల్సిన సూచనల వరకు ప్రతి అంశాన్నీ సూక్ష్మవివరణలో సహా ఈ పుస్తకంలో రాసినట్లు చెప్పారు. సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ రచయితలను అభినందించి, సత్కరించారు. సహ రచయితలు డాక్టర్ ఒ.శైలజ, డాక్టర్ కె.కిరణ్ కుమార్, రీసెర్చ్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సాయికృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్వరలో సిఎంతో ముస్లిం సంఘాల సమావేశం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కో-కన్వీనర్ అల్తాఫ్ బాబా ఆధ్వర్యంలో దశరథ జనార్ధన్‌ను అహలే సున్నతుల్ జమాత్ పెద్దలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఆ పార్టీ పొలిటికల్ సెక్రటరీ తొండేపు దశరథ జనార్ధన్ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలు వివరించే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ముస్లింల సమస్యలు తెలిపేందుకు త్వరలో ముఖ్యమంత్రితో సమావేశానికి అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం నాయకులు ఫరూక్ షుబ్లీ, అహలే సున్నతుల్ జమాత్ పెద్దలు అప్సరజమా, ఫహీంఅక్తర్, ఇంతిఖాబ్, ఇతరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి :

కంటి లోపాలున్న వారికి జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మండలంలోని గోపినేనిపాలెం గ్రామంలో గత వారంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆ శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం కళ్లజోళ్లు అవసరమైన 60 మందికి ఫౌండేషన్ చైర్మన్ దశరథ జనార్ధన్ ఉచితంగా కళ్ళజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా దశరథ జనార్ధన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో 10 గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 2వేల మందికి పైగా కంటి పరీక్షలు చేయగా, వారిలో 760 మందికి కళ్ళజోళ్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు నడ్లమూడి రాంబాబు, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, పట్టణ పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు కామినేని కిషోర్ పాల్గొన్నారు.

సమిష్టి కృషితో కొండపల్లి అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : అందరూ సమిష్టి కృషితో పనిచేసి కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి చేసుకోవాలని విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) సూచించారు. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్‌గా ఎన్నికైన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన చుట్టుకుదురు శ్రీనివాస్, కరిమికొండ శ్రీలక్ష్మి, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌లుగా ఎన్నికైన బసవ ఉమామహేశ్వరరావుతో కలిసి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)ని జంపాల సీతారామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను, ఎంపి శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య సారథ్యంలో

అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

పాఠశాలల రద్దు హేయం : ఎస్ఎఫ్ఐ

ఎంఇఒ బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కంచికచర్ల : జిల్లా వ్యాప్తంగా పలు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను తొలగించి విద్యావ్యవస్థ వినాశనానికి ప్రభుత్వం పాల్పడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్ ఆరోపించారు. కంచికచర్లలో మండలం పరిషత్ ఉన్నత పాఠశాల తొలగించటానికి నిరసనగా మంగళవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఎంఇఒ బి.బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్స్ వారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆకర్షించి, ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు 10,000 నుండి 80,000 వరకు పెంచి పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వం, మౌనం వహించడం సరికాదని స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంచికచర్ల మండలంలోని నాలుగు, వేములపల్లి, కొత్తపేట, పేరుకలపాడు, చెవిటికల్లు, పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఏం తేడా లేదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ షేక్ జాహిదా, మాధవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోతో ఇంద్రకీలాద్రిపై సిబ్బంది విధులకు హాజరు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కీలకమైన సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది పనివేళలు ఇక నుంచి ఫొటో ద్వారా నమోదు చేయబడతాయి. సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది పని తీరు మెరుగు పర్చే క్రమంలో సిబ్బంది హాజరు కచ్చితంగా తెలిసేలా గూగుల్ జీపీస్ మ్యాప్ కెమెరా ద్వారా లొకేషన్, టైమ్ కలిసి ఉన్న ఫొటో నిర్ధారణ డ్యూటీ ఆరంభంలో, డ్యూటీ ముగిసేటప్పుడు తీస్తున్నామని ఆలయ ఈవో వి. కె. శీనానాయక్ పేర్కొన్నారు. సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది అటెండెన్స్ నిర్ధారణ కోసం ప్రయోగాత్మకంగా పది రోజులు నుండి ఈ విధానం పరిశీలించామని, మంచి ఫలితాలు కనబడటంతో కొనసాగిస్తున్నామని అన్నారు. దేవస్థానం భద్రత, పారిశుధ్య విభాగాలలో 300 మందికి పైగా సిబ్బంది కాంట్రాక్టర్ ద్వారా పని చేస్తుండగా, ఈ తరహా అటెండెన్స్ విధానం వలన పారదర్శకత పెరిగిందని వెల్లడించారు. దుర్గాఘాట్‌ను ప్రతి రోజు తనిఖీ చేస్తుండటం సహా సిబ్బంది హాజరు పరిశీలన చేస్తుండటంతో ఘాట్ పరిశుభ్రత మెరుగు పడిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని సిపిఎం పోరుబాట

విజయవాడ : విజయవాడ రాణీగారితోటలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ భారాలకు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న స్మార్ట్ మీటర్లపై పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలపై విద్యుత్ భారాలను ఇష్టారాజ్యంగా మోపారు. చంద్రబాబు, లోకేష్ ఎన్నికల్లో విద్యుత్ భారాలను రద్దు చేస్తామని, పెంచబోమని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో 14500 కోట్లు విద్యుత్ భారాలను ప్రజల నెత్తిన మోపారన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు ప్రమాదమని, నష్టమని ప్రచారం చేసి ఎవరైనా స్మార్ట్ మీటర్ పెట్టడానికి వస్తే పగలగొట్టమని పిలుపునిచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే చంద్రబాబు, లోకేష్ బిజెపికి తలొగ్గి స్మార్ట్ మీటర్లను ఇళ్ళకు పెట్టాలని చెబుతున్నారని విమర్శించారు. ఇప్పటికే షాపులకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్ల బిల్లులు చూస్తే ప్రజలు

బెంబేలెత్తిపోతున్నారన్నారు. ప్రతి ఇంటి నుండి స్మార్ట్ మీటర్‌కు వ్యతిరేకంగా సంతకాలు, అభ్యంతర పత్రాలు జూన్ 24 నుంచి జులై 4 వరకు సేకరిస్తామన్నారు. జులై 4న రమేష్‌బాబు హాస్పటల్ వద్ద గల విద్యుత్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. అధికారులకు ఈ అభ్యంతర పత్రాలు అందించే కార్యక్రమంలో వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శివర్గ సభ్యులు టి.చంద్రశేఖర్, నగర నాయకులు డి.వరప్రసాద్, వై.కృష్ణ, అడపా కోటిరెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అడవి క్వారీ స్కూల్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి అడవి క్వారీ స్కూలు ప్రత్యేక యూపీ స్కూల్‌గా గుర్తించి యధాతథంగా కొనసాగించాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్, స్కూల్ కమిటీ చైర్మన్ అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో విద్యార్థులు

ఆందోళన చేస్తున్న విద్యార్థులు, సిఐటియు నాయకులు

చదువుకు దూరం కాకూడదని ఏర్పాటు అయిన అటవీ క్వారీ యుపి స్కూల్‌ను ఇటీవల కాలంలో డి గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలగా మార్చారని దీనితో ఇక్కడ విద్యార్థులు 4 కిలోమీటర్లు దూరం కొండపల్లి వెళ్లలేక చదువు మానేసిన పరిస్థితి దాపురించిందని అన్నారు. ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే వసంత తక్షణమే స్పందించి అడవి క్వారీ యు పి స్కూల్‌ను ప్రత్యేక అవసరాల రీత్యా యధాతథంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి కొండపల్లి అడవి క్వారీ స్కూల్‌ను అప్పర్ ప్రైమరీ స్కూల్‌గా కొనసాగించే వరకు సిఐటియు, ఎస్ఎఫ్ఐ తల్లిదండ్రులు స్కూల్ ను నిలబెట్టేందుకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు సిఐటియు నాయకులు కొండలరావు పాపయ్య పాల్గొన్నారు.

తువ్వ కాల్వ గండ్లు పరిశీలన

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు - అనిగండ్లపాడు గ్రామాల పరిధిలో ఉన్న తువ్వ కాలువ గండ్లను వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ మొండితోక జగన్మోహన్ రావు, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ నెలలు గడుస్తున్న ఒక్క గండిని కూడా పూడ్చలేదని అన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదూరు, వెల్దుర్తిపాడు గ్రామాల పరిధిలో ఉన్న తువ్వ కాలవ అక్టోబర్ నెలలో వచ్చిన వరదలకు కోతకు గురై 45 చోట్ల గండి పడి పొలాలపై వేసిన ఇసుక మేటలు తొలగించాలని కలెక్టర్ చెప్పినా ఇంత వరకూ ఆ మేటలు తొలగించలేదని అన్నారు. ఇసుక మేటలు వేసిన పొలాలకు ఎకరానికి 50,000 నష్టపరిహారం అందించాలన్నారు. ఇప్పుడు ఖరీఫ్ కూడా ప్రారంభమైంది, తువ్వకాలువ గండ్లు పనులు మొదలుపెట్టి పూర్తిస్థాయిలో తక్షణమే పూర్తి చేసి రైతులకు నీరు అందే విధంగా చూడాలని కోరారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ మైనర్‌లో డ్రైవ్ చేయడం, బండి డాక్యుమెంట్స్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేయడం, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని, పెండింగ్ చలానా ఉన్నవారిని ఆపి తనిఖీలు చేశారు. మైనర్ పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఈసారి రోడ్డుపైకి లైసెన్స్ లేకుండా మైనార్టీ తీరకుండా రోడ్డుపైకి వస్తే బండి సీజ్ చేస్తామని, త్రిబుల్ రైడింగ్ చేసిన ఉపేక్షించేది లేదని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రూ.24.24 లక్షల ఎల్‌ఒసి అందజేత

ప్రజాశక్తి - విజయవాడ సిటీ :

52వ డివిజన్ మల్లికార్జున పేటకు చెందిన ఆకుల దివ్య (34) లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.24 లక్షల 24 వేల విలువైన ఎల్‌ఒసి పత్రాన్ని బాధితురాలి తండ్రికి అందజేశారు. ఎంఎల్‌ఏ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, అందజేశారు.

ప్రమోషన్లు ఇచ్చి బదిలీ చేయాలని

సచివాలయ ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి-గుడివాడ: సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే బదిలీలు చేయాలని విలేజ్ అండ్ సచివాలయం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.రాజ్, జి.శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో పనిచేస్తున్న విలేజ్ అండ్ సచివాలయం ఎంప్లాయిస్ సభ్యులు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి ఆర్‌డివో కార్యాలయం వరకు నిరసన తెలిపి అనంతరం ఆర్‌డివో బాలసుబ్రహ్మణ్యంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గుడివాడ మున్సిపల్ పరిధిలోని సచివాలయ ఉద్యోగులకు జీవో నెంబర్ 5ను మార్పు చేసి సచివాలయ ఉద్యోగులకు వారి సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. సర్వీస్ రూల్స్ ప్రకారం ఉద్యోగులను ఏ శాఖలోకి తీసుకుంటారో, వారిని ఎలా సమీకరిస్తారో స్పష్టమైన నిర్ణయం ప్రభుత్వం ప్రకటించాలన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా మిగులు ఉద్యోగులను డిప్యూటేషన్ విధానంలో కాకుండా శాశ్వత విధానంలో ఏశాఖకు బదిలీ చేస్తారో స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగికి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్‌ను వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, కె సునీత, కె మనోజ్ కుమార్, జి గణేష్, ట్రెజరీలు పి రవికుమార్, పి రోజా, ఎస్‌కె మున్వర్ భాషా, నాగరాజు, బాబీ, భారతి, కె మహాలక్ష్మీ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రేషన్లైజేషన్, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కోరుతూ గ్రామ వార్డు సచివాల ఉద్యోగుల సంఘం నాయకులు జి. గోపిచంద్, ఉద్యోగులు ఏపీ జేఏసీ అమరావతి కృష్ణా జిల్లా చైర్మన్ శ్యామ్‌నాథ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ డికె బాలాజీకి వినతి పత్రం అందజేశారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు వార్డు టు వార్డు ఆయా యుఎల్‌బి పరిధిలో బదిలీలకు అవకాశం కల్పిస్తూ జిఓ 6 జారీ చేసిన విధంగా రూరల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులకు కూడా సొంత మండలాల్లో బదిలీలు చేపట్టాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సీనియారిటీ, మెరిట్ ప్రాతిపదికన బదిలీలు నిర్వహించాలన్నారు. సచివాలయ ఉద్యోగిపై సింగిల్ కంట్రోల్ అధికారి నియంత్రణ ఉండేలా విధివిధానాలు రూపొందించాలని, సర్వేల నుంచి విముక్తి కల్పించాలన్నారు. గత ప్రభుత్వం తొమ్మిది నెలలు ఆలస్యంగా ప్రొహిబేషన్ డిక్లరేషన్ చేసినందుకు రావలసిన బకాయిలు, నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రభుత్వం మంజూరు చేయాలని, క్వాలిఫికేషన్ ఆధారంగా కనీసం జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్, టెక్నికల్ పే స్కేల్ ఉద్యోగులకు అమలు చేయాలన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

రవాణా శాఖాధికారిగా మురళీధర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లా రవాణా శాఖాధికారిగా పి.మురళీధర్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ప్రొద్దుటూరులో రీజినల్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కృష్ణాజిల్లా రవాణా శాఖాధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా మురళీధర్ ను మచిలీపట్నం రవాణా శాఖాధికారులు శ్రీనివాస్ నాయక్, సిద్ధిక్, గుడివాడ, ఉయ్యూరు యూనిట్ కార్యాలయ రవాణా శాఖా అధికారులు తదితరులు అభినందనలు తెలిపారు. తొలుత మురళీధర్ జిల్లా కలెక్టర్ డికె బాలాజీని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మోపిదేవి: శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానం పథకానికి మంగళవారం తెనాలికి చెందిన మద్దిరెడ్డి భార్గవరెడ్డి, మనస్వి దంపతుల కుమార్తె నిహిర పేరు మీద లక్ష రూపాయలు ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది తిమ్మన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు శుద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి-గన్నవరం: రైతులు వరి సాగు చేసే ముందు విత్తనాలను శుద్ధి చేసుకోవాలని వ్యవసాయ శాఖ గన్నవరం సబ్ డివిజన్ ఏ డి ఏ సునీల్ చెప్పారు. మంగళవారం మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రైతులు కాంప్లెక్స్ ఇరువులను ఎక్కువగా వినియోగించాలన్నారు. వరి విత్తనాలను శుద్ధి చేసుకుంటే మంచి నారు దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. రైతులు గ్రామాల్లోకి వచ్చి ఏఈఓల ద్వారా వ్యవసాయ సమాచారం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో కే.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: రైతులు వరి విత్తనాలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, వరి నారుమడులలో ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకుండా సహజ ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి తెలిపారు. హనుమంతపురం, అయినంపూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై సూచనలిచ్చారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లి జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల టాపర్స్‌కు ప్రోత్సాహకంగా రిటైర్డ్ డిఇఒ మట్టా రాధాకృష్ణమూర్తి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మచిలీపట్నం శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.సత్యప్రసాద్‌బాబు పరివేక్షణలో కొండలమ్మ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, గుడ్లవల్లేరు పోలీసు సిబ్బంది, వడ్లమన్నాడు ఇండియన్ బ్యాంక్ సిబ్బంది సమక్షంలో జరిగిన లెక్కింపులో మొత్తం రూ.31,81,084 వచ్చినట్లు తెలిపారు. బంగారం, వెండి లెక్కింపు వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఈవో కొండలరావు తెలిపారు.

రైతులకందని ధాన్యం సొమ్ము

ప్రజాశక్తి-గన్నవరం: మండల పరిధిలో దాళ్వా సాగు చేసిన రైతులకు ధాన్యం సొమ్ము అందకపోవటంతో గగ్గోలు పెడుతున్నారు. రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేసినా ఆచరణలో మాత్రం అలా జరగటం లేదు. దీంతో ధాన్యం మిల్లులకు తరలించిన రైతులు సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలోని ముస్తాబాద్, పురుషోత్తపట్నం, వీరపనేని గూడెంలో దాళ్వా వరి సాగు దాదాపు రెండు వేల ఎకరాల్లో జరిగింది. పంట చేతికి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఆలస్యంగా ధాన్యం' కొనుగోలు చేపట్టింది. దీంతో తొలిదశలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత ధాన్యం కొనుగోళ్లు జరిగినా అనేక అవాంతరాల మధ్య మిల్లులకు తరలించారు. మిల్లులకు వెళ్లిన ధాన్యానికి వారం రోజుల్లో సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మరలా కొద్ది రోజుల తర్వాత బ్యాంక్ గ్యారంటీ లేదని రైతులు వద్ద ధాన్యం కొనుగోళ్లు చేయలేదు. మరలా రైతులు ఆందోళన వ్యక్తం చేయటంతో ప్రభుత్వం నానా తంటాలు పడి ధాన్యం కొనుగోళ్లు చేసింది. మండల పరిధిలో రైతులు అమ్మిన ధాన్యానికి గత 45 రోజులుగా ప్రభుత్వం సొమ్ము చెల్లించలేదు. మండలంలో మూడు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం డబ్బులు ఇంకా పడలేదు. రైతులు కష్టాలు గుర్తించి వెంటనే ధాన్యం సొమ్ము చెల్లించాలని రైతులు కోరు తున్నారు. త్వరలో రైతుల సొమ్ము చెల్లిస్తారని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులు 'మత్తు'కు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-ఉంగుటూరు: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం ముగిసినట్టే అని హనుమాన్ జంక్షన్ సిఐ కెవిఎంఎన్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాన్ని వివరించేందుకు విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సరదాకు మొదలుపెట్టిన మత్తు పదార్థాల వాడకం తరువాత భవిష్యత్తు అంధకారంగా మారే వరకు వదలవని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసలు అయితే ఆరోగ్యం దెబ్బతినడమే కాక సమాజంలో గౌరవం కూడా కోల్పోతారన్నారు. మని అక్కడితో జీవితం ముగిసిపోతుంది అని అంతే కాకుండా మీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు సమాజంలో తలెత్తుకొని లేని స్థితి ఏర్పడుతుందని దీనిని గమనించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్కూరు ఎస్ఐ చావ సురేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడినవారు చదువులో వెనుకబడటంతో పాటు జ్ఞాపకశక్తి మందగించి ఏ విషయం పైనా దృష్టి సారించలేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాయులు పొట్లూరి రాధికా రాణి పాల్గొన్నారు.

ఈపాస్ మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగుళూరు కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, పారదీప్ ఫాస్పేట్ వారి సహకారంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి వైవీఎస్ వి.మనోహర్రావు చేతుల మీదుగా మంగళవారం గన్నవరం వ్యవసాయ సబ్ డివిజన్లోని ఎరువుల దుకాణం డీలర్లకు ఈపాస్ మెషిన్స్ పంపిణీ చేశారు. 53 ఈపాస్ మెషిన్స్ లైసెన్సు కలిగిన డీలర్స్‌కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నవరం వ్యవసాయ సబ్ డివిజన్ ఏడిఏ ఎం.సునీల్, కంపెనీ పారాదీప్ ఫోస్ఫేట్స్, ఎన్జీ ఫెర్టిలైజర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-మొవ్వ: జిల్లాలోని మొవ్వ, మోపిదేవి మండలాల్లో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సాహించేందుకు త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీకి కేటాయించడం జరిగింది. ఇందులో భాగంగా మంగళవారం మొవ్వ గ్రామంలో మండవ సుధీర్‌కు చెందిన మూడు ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రైతులు మండవ ఫణి, మండవ కోటేశ్వరరావు, మండవ శ్రీకృష్ణ, తాతినేని శరత్, రత్నగిరిరావు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మొవ్వ పి నాగరాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ కీర్తి పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: ఖరీఫ్ సీజన్లో వరి సాగు రైతులకు పుష్కలంగా నీరు అందించాలన్నఉద్దేశంతో బందరు కాలవలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు కెసి సెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.రవి కిరణ్ తెలిపారు. మంగళవారం ఏఈ నాగబాబుతో కలిసి బందర్ కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. కంకిపాడు లాకు 20వ కిలోమీటర్ నుండి పత్తేలంక 35 కిలోమీటర్ వరకు రూ.18 లక్షలతో ఈ పనులు చేస్తున్నట్లు తెలిపారు. బందరు కాలువ అడుగున ఉన్న టేపు గ్రాస్ -కర్ర నాచు నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్నందు వల్ల పంటి మీద ఎక్స్కవేటర్ మిషన్‌తో తొలగిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల బందరు కాలువ పరిధిలోని ప్రతి ఎకరాకు పుష్కలంగా నీరు అందుతుందని తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - తిరువూరు : ఎ.కొం డూరు మండలం, కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు దాత కంప్యూటర్ బహూ కరించారు. స్కూల్‌కు అవస రమైన రూ.20వేల విలువ చేసే కంప్యూటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాం ప్రదీప్ తన తండ్రి వెంకటేశ్వరావు జ్ఞాపకార్థంగా మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కె.రాంబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.నాగేంద్రరావు, వి.తేజస్విని, వి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సురేష్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వత్సవాయి : ఇటీవల మృతిచెందిన వైసిపి నాయకుడు యానాల సురేష్ కుటుంబాన్ని పలువురు వైసిపి నేతలు మంగళవారం పరామర్శించారు. సురేష్ చిత్రపటానికి వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్, నందిగామ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ మొండితోక జగన్మోహన్ రావు, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి నాయకులు, పోలంపల్లి మాజీ సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన విద్యాబోధనకు కొత్త క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థుల అసాధారణ విజయాలతో స్ఫూర్తి పొంది, న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అధునాతన సాంకేతిక విద్యాబోధన కోసం తమ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించినట్లు సంస్థ సహ వ్యవస్థాపకులు సిద్ధార్థ మహేశ్వరి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో రెండో సంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులలో అసాధారణ స్థాయిలో 93 శాతం మంది అగ్రశ్రేణి టెక్ సంస్థలు, ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు పొందారని తెలిపారు. రేజర్‌పే, ఏఐ, జూమ్‌కార్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు, డీఆర్‌డీఓ లాంటి గౌరవనీయ పరిశోధనా సంస్థల్లో వీరు ఇంటర్న్‌షిప్‌లు సాధించారని తెలిపారు. ప్రముఖ టెక్, స్టార్టప్ కేంద్రమైన ఎలక్ట్రానిక్ సిటీలో న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సరికొత్త క్యాంపస్‌ను నిర్మించిందన్నారు. ఉద్యోగాలకు సిద్ధం చేసే ఆచరణాత్మక టెక్ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడం ఈ క్యాంపస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కొత్త క్యాంపస్‌లో 2,500 మంది విద్యార్థులు చదువుకునే వీలు కల్పించారని, వెయ్యి మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు కూడా ఉంటాయని తెలిపారు.

మైలవరం డిగ్రీ కళాశాలకు రీసెర్చ్ గ్రాండ్

ప్రజాశక్తి - మైలవరం : కృష్ణ యూనివర్సిటీ పరిధిలోగల డాక్టర్ లక్కిరెడ్డి హనీమీ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భారత ప్రభుత్వం ద్వారా అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు కింద రూ.30 లక్షల, 50లు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇల్లా రవి, వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జె.రాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు కనుమల్లో గల ఆర్కిడ్ మొక్కల ప్రస్తుత స్థితి వాటిలో అను జీవన శాస్త్ర, మొక్కల్లో గల ఔషధ గుణాలు అధ్యయనం అనే అంశంపై రీసెర్చ్ ప్రాజెక్టు భారత ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రీసెర్చ్ ప్రాజెక్టు ద్వారా ఏపీలోని తూర్పు కనుమల అడవుల్లో లభ్యమయ్యే ఆర్కిడ్ మొక్కల గురించి అధ్యయనం వాటిలో గల ఔషధ రసాయనాలతో పాటు జీవాను శాస్త్ర ద్వారా జీవ వైద్యాన్ని అధ్యయనం చేయవలసి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు కాలపరిమితి మూడు సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు.

ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అంబేద్కర్‌ను దూషించిన వారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరువూరు : బాబాసాహెబ్ అంబేద్కర్‌ను సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్య పదజాలంతో దూషించిన సుధీర్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైసిపి నాయకులు మంగళవారం తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి యరమల రామచంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరి నవీన్, నాయకులు చలమాల సత్యనారాయణ, మోదుగు ప్రసాద్, బండారు పద్మావతి, మామిడి కుటుంబరావు, షేక్ జాకీర్, సీతారామయ్య, గుమ్మా పాపారావు తదితరులు పాల్గొన్నారు. **విస్సన్నపేట :** విస్సన్నపేటలో వైఎస్‌ఆర్‌సిపి లీగల్ సెల్ నాయకులు శిరసాని ప్రకాష్, ఇండియన్ ఇంటెలెక్చువల్ ఫోరం కో- కన్వీనర్ కోపల్లి జయకర్ ఆధ్వర్యంలో సుధీర్ బాబుపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సిపి నాయకులు ఓలేటి దుర్గారావు, గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు పల్లెపాం లక్ష్మయ్య నెక్కలపు కుటుంబరావు షేక్ కాలేషా వలి సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జులై 30న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - నందిగామ : జులై 30న విజయవాడ రామవరప్పాడులో జరిగే జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం నందిగామ సిఐటియు భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది మంది భవ ఇతర నిర్మాణ కార్మికులు ఉన్నారని, గత ఐదు సంవత్సరాలుగా కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మాణం రంగంలో ఉన్న 36 రకాల వత్తుల కార్మికులందరూ ఐక్యంగా పోరాడి సంక్షేమ బోర్డును కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, బిల్డింగ్ వర్కర్ సీనియర్ ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె. గోపాల్, చందర్లపాడు మండలం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి తోట రామారావు, నందిగామ మండలం బిల్డింగ్ కార్యదర్శి షేక్ హస్సన్. తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిల్లి నరసింహారావు

లారీడ్రైవర్స్ అండ్ క్లీనర్స్ కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో జయహో రవాణా రథసారథి లారీ డ్రైవర్ అండ్ క్లీనర్స్ వర్కర్స్ సిఐటియు అనుబంధం సమావేశం జుజ్జూరు గ్రామంలో మంగళవారం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా లాల్ అహ్మద్ గౌస్ సిఐటియు మండల కార్యదర్శి అధ్యక్షులుగా బండారుపల్లి మహేష్, ఉపాధ్యక్షులు కోలా నరేష్ ప్రధాన కార్యదర్శి లంక మణికంఠ, సహాయకార్యదర్శి నరసింహారావు కోశాధికారి బత్తుల తిరుపతిరావు కార్యవర్గ సభ్యులు షేక్ బాజీ వలి శ్రీనివాసరావు, శీను నాగులు మీరా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బండారుపల్లి మహేష్ మాట్లాడుతూ జూలై 9న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెను లారీడైవర్సరీస్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు

కంచికచర్లలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ ఛట్టాలను రద్దు చేయాలని కోరుతూ కేంద్రకార్మిక సంఘాల ఆధ్వర్యంలో జులై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కంచికచర్ల గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి మంగళవారం కంచికచర్ల పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంకు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కార్మికులతో కలిసి ఎంఇఒ బి.బాలాజీ సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ 2019లో కరోనా కాలంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో నాలుగు లేబర్‌కోడ్లు తీసుకువచ్చిందని తెలిపారు. దీనిలో భాగంగా ఫ్యాక్టరీస్, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాలు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోనూ 8 గంటల పని స్థానంలో 10 గంటల పనిదినంగా మార్పు చేసిందని తెలిపారు. రక్షణ సౌకర్యాలు కల్పించకుండా మహిళలతో రాత్రి షిప్టులలో పని చేయించుకునేందుకు యాజమాన్యానికి స్వేచ్ఛ ఇస్తూ, శ్రామిక మహిళల హక్కులను కాలరాస్తూ చట్టంలో సవరణలు తెచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కంచికచర్ల మండల కార్యదర్శి బి.భూషణం, పంచాయతీ యూనియన్ నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాలలో పరీక్ష

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : గురుకుల పాఠశాలల్లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు బాలికల గురుకుల పాఠశాల్లో నిర్వహించే పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని రంగాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తబిత తెలిపారు. బుధవారం జి.కొండూరు మండలం, కుంటముక్కల బాలికల గురుకుల పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన సమయంలో మాత్రమే చేరుకోవాలని, ముందుగా వచ్చి ఇబ్బందులు పడొద్దని 6, 7 తరగతుల వారికి ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు, 8, 9 తరగతుల వారికి మధ్యాహ్నం 2 గం నుండి 3 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

నీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

మంచినీటి ట్యాంకర్ ప్రారంభం

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని అనిగళ్లపాడు గ్రామానికి చెందిన ఎన్నారై ఈపూరి రవీంద్రారెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీంద్ర రెడ్డి సేవా నిరతిని అభినందించారు. గ్రామ సమస్యలు తెలుసుకుని ఇలాంటి అవసరతలు తీర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్సిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు మధుసూదన్ రావు, మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు గడుపూడి వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మరణవార్త తెలుసుకొని గండ్రాయి గ్రామంలో వారి నివాసంలో ఆయన మృతదేహంపై టిడిపి జెండా కప్పి, నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య, తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యనారాయణ ప్రసాద్ నివాళులర్పించారు.

అడుగడుగునా గోతులే...

అధ్వానంగా గోపవరపుగూడెం-పురుషోత్తపట్నం రోడ్డు

ప్రజాశక్తి-గన్నవరం: అడుగడుగునా గోతులు పెద్ద అగాదాలతో గోపవరపు గూడెం-పురుషోత్తపట్నం రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు భయంతో వణికిపోతున్నారు. బైపాస్ జాతీయ రహదారి నుంచి కొండపావులూరు, గోపవరపు గూడెం నుండి చిక్కవరం రైస్ మిల్లు వరకు రహదారిని కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్డు గోతులు పడ్డాయి. గన్నవరం రావడానికి ఇదే ప్రధాన రహదారి. చిక్కవరం రైస్ మిల్ రోడ్డు కూడలి మొదలు దారి మొత్తం గోతులమయంగా మారింది. గోపవరపు గూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం పరిసరాల్లో రోడ్డు ఎక్కడ చూసిన అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గోతులు, కోతకు గురైన రోడ్డు మార్జిన్లతో అస్తవ్యస్తంగా ఉంది. ఎగుడుది గుడు రోడ్డుపై ప్రయాణం సాఫీగా సాగక వాహన దారులు అవస్థలు పడుతున్నారు. అడుగడుగునా గోతులమయంగా మారిన రోడ్డుమీదుగా రాకపో కలు సాగటం లేదు. రాత్రిళ్ల ఈ మార్గంలో ఉన్న పెద్ద గోతులు కనిపించకపోవటంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి.

చినుకు పడితే చెరువులే

మోస్తరు వర్షం కురిసినా ఈ రోడ్డు చెరువును తలపిస్తోంది. గోతుల్లో నీరు నిలిచి పోయి రోజుల తరబడి కదలటం లేదు. దీంతో గన్నవరం రాకపోకలు సాగించే వాహనదారులు మురుగులో వాహనాలు నడ పలేక అవస్థలు పడుతున్నారు. మురుగునీటి తటాకాలు తయారై ప్రమాదకరంగా మారిన రోడ్డు గుండా రాకపోకలు సాగించలేకపోతున్నామంటూ వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అన్ని ప్రధాన రహదారులను ఏడాది లోపు అభివ ద్ధి చేస్తామని కూటమి సర్కారు ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. మూడు గ్రామాలను అనుసంధానం చేసే ఈ రోడ్డును మాత్రం నిర్లక్ష్యం చేసింది. దీంతో రోడ్డు మొత్తం అధ్వానంగా మారింది. కూటమి నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా పరిణమించిందంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని జనాలు కోరుతున్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉంగుటూరు: పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆత్కూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు

తెలిపిన వివరాల ప్రకారం... ఆత్కూరుకు చెందిన మొగల్ వహీదాభి (19) ఉషారామా కళాశాలలో డిప్లమో చదువుతోంది. సోమవారం విడుదలైన ఫలితాల్లో నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుంది. అప్పుడే ఇంటిని వచ్చిన తమ్ముడు గమనించి ఆమెను గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. వహీదాభి తండ్రి అనారోగ్యంతో ఐదేళ్ల క్రితమే మరణించాడు. ప్రస్తుతం తల్లి, తమ్ముడు ఉన్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై మేరకు ఎస్ఐ చావా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరీ పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఘంటసాల: ప్రహరిగోడ నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఎంపిడివో డి.సుబ్బారావు అన్నారు. పెద్దగూడెంలో రూ.2.50 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరి గోడ నిర్మాణ పనులను ఎంపిడివో సుబ్బారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ పాఠశాల అభివద్ధికి, ప్రహరిగోడ నిర్మాణానికి ఎంపీటీసీ దిరిశం వెంకటలక్ష్మి కోరగా ఎంపీపీ వేమూరి రజనీ కుమారి, పాలకవర్గం సభ్యుల ఆమోదంతో రూ.2.50 లక్షలు మంజూరు చేయగా పనులు జరుగతున్నాయన్నారు. పనులను సక్రమంగా చేపట్టాలని, సకాలంలో పనులు ముగించాలని కోరారు. పెద్దగూడెం పాఠశాల అభివద్ధికి సహకరించిన ఎంపీపీ రజని కుమారికి, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎంపీపీ దిరిశం వెంకటలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరి ప్రవీణ్. వేమూరి రత్నశేఖర్, దిరిశం పిచ్చేశ్వరరావు ఉన్నారు.

రహదారి విస్తరణ పనులు వేగవంతం : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్లో రహదారి విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రహదారి విస్తరణ పనుల పురోగతిపై మంగళవారం రాత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ నేపథ్యంలో రహదారి ఆక్రమణలు తొలగించిన భాగంలో రహదారి అంచులను డ్రైనేజీ నిర్మాణం, విద్యుత్ లైన్లు ఏర్పాటు డివైడర్ల నిర్మాణం డివైడర్ పై పచ్చదనం ఏర్పాటు గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ఈ రహదారిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ రహదారిపై మళ్లీ ఆక్రమణలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి విస్తరణకు నిధుల కొరత ఉంటే తన దష్టికి తీసుకురావాలన్న ఆయన అత్యంత నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం నడిబొడ్డున ఉంటూ, విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఈ రహదారి అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం తహసిల్దార్ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, ఏఈలు దాసు, శ్రీహరి, సుజాత, వెంకట్ రాజు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న యార్లగడ్డ

లాకుల వద్ద పనులు పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ లాకుల వద్ద కోడూరు వైపు వెళ్లే తూర్పు కాలువ నాగాయలంక వైపు వెళ్లే దక్షిణం కాలువ ముఖద్వారాల వద్ద ఇరిగేషన్ అధికారులు లెవెలింగ్ పనులు చేపట్టారు. ఈ నెల 27వ తేదీన నీరు విడుదల చేయనున్నట్లు ఇంచార్జి డిఈఈ బాబునాయక్ చెప్పడంతో ఎల్ఎఫ్ఆర్ వద్ద లెవలింగ్‌ను ఏఈ రవి కిరణ్, నాగాయలంక కోడూరు ఏఈలు పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన లాకుల ముఖ ద్వారం వద్ద ఏర్పడ్డ అడ్డంకులను గోతులను పూడ్చి నీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల దోపిడికి అడ్డూ అదుపు లేకుండా పోతుందని వారి దోపిడీని జిల్లా విద్యాశాఖ అధికారులు అరికట్టాలని కోరుతూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫామ్ అమ్ముతూ దోపిడి చేస్తున్నారని, ఈ విషయంపై ఈ నెల 13న జిల్లా విద్యాశాఖాధికారి పిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అమ్మే పుస్తకాలు కొనొద్దని తెలిపారు. అసలు అక్కడ అమ్మడం నిబంధనలకు విరుద్ధమని, ఏ పాఠశాలలో అయినా అమ్మినట్లు తెలిసినా, తప్పని సరిగా విద్యార్థులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసినా రాత పూర్వకంగా తనకు ఫిర్యాదు చేయాలని, అనంతరం విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కోడూరు: వాహనదారులు తమ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేనియెడల జరిమానాలను విధించడం జరుగుతుందని కోడూరు ఎస్సై చాణిక్య తెలిపారు. మంగళవారం సాయంత్రం కోడూరు ప్రధాన సెంటర్లో వాహనాల తనిఖీలను సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని వారికి జరిమానా విధించి పెండింగ్ లో ఉన్న చలానాలు కట్టించారు. ప్రతి ఒక్కరు కూడా బాధ్యతగా వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతివేగంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు పరిమితంగా ప్రయాణికులను ఎక్కించుకోవాలని, ఆటోలు, ట్రాక్టర్ లు నడిపేటప్పుడు లౌడ్ స్పీకర్ లు పెట్టవద్దని ఎస్సై చాణిక్య తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా రహదారి భద్రత సూచనలను పాటించాలని ఆయన కోరారు.

టిసిలు ఇవ్వకుండా ఇబ్బందులు

ప్రజాశక్తి-కంకిపాడు: మండలంలోని పునాదిపాడులో విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పునాదిపాడు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు టిసిలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, గట్టిగా ప్రశ్నిస్తే అసభ్యకరంగా మాట్లాడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడ్డాడ, కురుమద్దాలిలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-పామర్రు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాలలో మౌలిక వసతుల అభివద్ధి పూర్తిస్థాయిలో కనిపించేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని పామర్రు మండల ప్రత్యేక అధికారి ఫణి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఇన్చార్జి ఎండిఓ గుత్తికొండ కిషోర్ అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ, త్రాగునీరు వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అధీనంలో నిర్వహించబడుతున్న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025 కార్యక్రమంలో భాగంగా పామర్రు మండలంలోని కురుమద్దాలి,అడ్డాడ గ్రామాలు ఎంపిక చేసినట్లు ఆయన ప్రకటించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ ఎంపిక చేసిన గ్రామాలలో పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైసిపి తీరును ప్రజలు గమనిస్తున్నారు : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: వైసిపి అవలంభిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలో ఇప్పటికీ పశ్చాతాపం లేదన్నారు. వైసీపీ కార్యకర్త సింగయ్య మరణం నేపథ్యంలో జగన్ వ్యాఖ్యలు ఆయనలోని మానవత్వ లోపానికి బాధ్యత రాహిత్యానికి పరాకాష్టగా నిలుస్తాయన్నారు. వైసిపి పాలనలో ఎవరిపైనా అక్రమ కేసులు పెట్టలేదని చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. నియోజకవర్గంలో ఐదు వేల ఎకరాల సాగునీటి సమస్యపై తహసిల్దార్‌కు అర్జీ ఇస్తామంటే వైసీపీ ప్రభుత్వం అక్రమ అరెస్టు చేసిందని, పోలీసు కవాతులతో భయానక వాతావరణం సృష్టించిందని తెలిపారు. ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రతిసారి తనతో పాటు నియోజకవర్గంలోని టిడిపి, జనసేన నాయకులకు అక్రమ నోటీసులు ఇచ్చిన వైసీపీ పాలకుల తీరు వారి ఓటమికి బాటలు వేసిందన్నారు. రాష్ట్ర ప్రజల స్వేచ్ఛను హరించిన జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా ఇంకా మార్పు రాలేదన్నారు.

ముగిసిన ఫిక్కీ సమావేశాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్ (సైఫ్ జోన్) భాగస్వామ్యంతో, వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ), ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ నోవాటెల్‌లో రెండు రోజుల పాటు జరిగిన సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎం.ప్రతాప్ కుమార్ మాట్లా డుతూ మార్కెట్లలోకి భారతీయ వ్యా పారాలు విస్తరించడంలో సహాయపడే లక్ష్యంతో విజయవాడలో ప్రత్యేక బి2బి సమావేశాల శ్రేణిని విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. ఈ సమావేశాలు విస్తృత శ్రేణిలో వాణిజ్యం, వ్యాపార అవకాశాలను గురించి అవగాహన అందించాయని తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో వ్యాపారాలను విస్తరించడంతో పాటుగా ఎగుమతులు, ఇరు దేశాల నడుమ కార్యకలాపాలను పెంచడానికి ఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సెపా) ను ఉపయోగించడంపై కూడా వారు మార్గదర్శకత్వం అందించారన్నారు. వ్యాపార కార్యకలాపాలను విస్తరించడానికి భారతదేశం-యుఏఈ సేపా ప్రయోజనాలను ఉపయోగించుకోవడానికి సరైన వేదికగా ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని తెలిపారు.

సదస్సులో చర్చిస్తున్న ప్రతినిధులు

ఆకతాయిలకు అడ్డాగా రైతు భరోసా కేంద్రం

ప్రజాశక్తి- నందిగామ : చందర్లపాడు ఎంపిడిఒ ఆఫీస్ ముందు కట్టిన రైతు భరోసా కేంద్రం ఆకతాయి కుర్రాళ్ళకు అడ్డగా మారింది. చందర్లపాడు మండలం చందర్లపాడు గ్రామంలోని ఉన్న స్థానిక ఎమ్ డి ఓ ఆఫీస్ ఎదురుగా అప్పుడు గత గవర్నమెంట్ లో కట్టి ఖాళీగా ఉంచిన రైతు భరోసా కేంద్రాల్లో మద్యం సేవించే వాళ్లకు ఆగతాయిగా తిరిగేవాళ్ళకు అడ్డాగా మారింది. దీంట్లో కొంతమంది కుర్రాల్లో మద్యం సీసాలు తీసుకొచ్చి మద్యం సేవించి, ఆ చుట్టుపక్కన ఉన్న ఇల్లవాళ్ళతో గొడవలు పెట్టుకోవడం జరుగుతుంది. ఖాళీగా ఉన్న మద్యం బాట్లను పగలగొట్టి రోడ్డు మీద పడటం ఇలా పబ్లిక్ ను ఇబ్బంది పెట్టడం జరుగుతుంద స్థానికంగా నివసిస్తున్న ప్రజలు చెబుతున్నారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనీమీ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ విభాగాలలో గెస్ట్ లెక్చరర్స్‌గా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో 55శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఏపీ సెట్, యుజిసి సెట్, పీహెచ్డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాలతో ఈనెల 28వ తేదీ లోపు కళాశాలలో కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9959108829 నెంబరును సంప్రదించాలని కోరారు.

హస్తకళలపై సావనీర్ డిజైన్ పోటీలు : లేపాక్షి చైర్మన్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : చేనేత హస్త కళాకారులు, కార్మికులు, డిజైన్లు, చేతిపనుల పట్ల మక్కువ కలిగి సృజనాత్మక అభిరుచి కలిగిన ఔత్సాహికుల నుండి హస్తకళలపై సావనీర్ డిజైన్ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు కోరుతూ అవకాశం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సాంప్రదాయ హ్యాండీక్రాఫ్టలు, హ్యాండ్లూమ్స్‌లో కొత్త సావనీర్ డిజైన్లను సృష్టించేందుకు జాతీయ డిజైన్ సంస్థ రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 8 సంవత్సరాల వయస్సు పైబడి రాష్ట్రానికి చెందిన కళాకారులు, వీవర్స్, డిజైనర్లు, విద్యార్థులు ప్రజలు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. హస్తకళలపై సామర్థ్యాన్ని పెంచడం, సాంప్రదాయ కళాకృతులు, ఆధునిక డిజైన్లను కలిపిన కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్‌కు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కొండపల్లి బొమ్మలు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఏటికొప్పాక బొమ్మలు, తిరుపతి జిల్లాకు చెందిన చెక్కతో చెక్కవేతనం, కృష్ణా జిల్లాకు చెందిన కళంకారి బ్లాక్ ప్రింట్స్, శ్రీసత్య సాయిజిల్లాకు చెందిన చర్మపప్పెట్రీ అంశాలపై ధర్మవరం సిల్క్స్, ఉప్పాడ సిల్క్స్, వైస్ట్ కోట్స్, మంగళగిరి, బందర్, రాజమహేంద్రవరం, కృష్ణ, తూర్పు గోదావరి జిల్లాల హ్యాండ్లూమ్స్‌లపై పోటీలను నిర్వమిస్తున్నట్లు తెలిపారు. హ్యాండీక్రాఫ్ట్స్ ఆంధ్రప్రదేశ్ సావ్‌నీర్‌లలో న్యూమాటిక్, ఆటోమేషన్, కొత్త డిజ్కెన్లను హ్యాండ్లూమ్స్‌లో పాల్స్, స్కార్ఫ్స్, ట్కెస్, వైస్ట్ కోట్స్ వంటి ఉపయుక్త వస్తువులను పరిచడం చేయాలన్నదే పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. పోటీలలో హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్స్‌లో ఒక్కొక్క విభాగంలో ఐదుగురు మొత్తంగా పదిమందికి మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా 10 వేలు పారితోషకంగా అందిస్తున్నట్లు తెలిపారు. జూలై 16వ తేదీ లోగా కొత్తగా సృష్టించిన సావనీర్ సమూనాలను రాష్ట్రంలోని సమీప లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో సమర్పించాలన్నారు. పోటీల ప్రక్రియను లేపాక్షి వైస్ చైర్మన్, మేనేజింగ్ డ్కెరెక్టర్ ఎం.విశ్వ పర్యవేక్షిస్తారన్నారు. ఇతర వివరాలకు లేపాక్షి వెబ్ సైట్ https://lepakshihandicrafts.gov.in ఆప్కో వెబ్ సైట్ https://www.apcofabrics.comను సందర్శించవచ్చని లేపాక్షి చైర్మన్, పసుపులేటి హరిప్రసాద్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఆర్చరీ క్రీడాకారులకు శాప్ చైర్మన్ అభినందన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆర్చరీ క్రీడాకారులను శాప్ చైర్మన్ రవినాయుడు మంగళవారం అభినందించారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకూ సింగపూర్‌లో జరిగిన ఆర్చరీ ఏషియా కప్ లెగ్-2 పోటీల్లో కాంపౌండ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన టి.గణేష్ మణిరత్నం, ఇండివిడ్యువల్, మిక్సిడ్, టీమ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన బి.షణ్ముఖి నాగసాయిని అభినందించారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో క్రీడాకారులు శాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్చరీలో వారు సాధించిన పతకాలు, విజయాలు గురించి వివరించారు. సందర్భంగా వారిని శాప్ చైర్మన్ అభినందించడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని విస్తృతం చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వోల్గా ఆర్చరీ అకాడమీ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ, ఆర్చరీ కోచ్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ కొరియా కప్‌లో కార్తీక్‌కు కాంస్య పతకాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కొరియాలోని ఇంచెయోన్‌లో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు జరిగిన బ్యాంక్ ఇంచెయోన్ కొరియా కప్ ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజయవాడకు చెందిన బి.ఎమ్.ఎన్.వి.కార్తీక్ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. కన్సలేషన్ మ్యాచ్ పురుషుల వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం, మిక్సిడ్ టీమ్ విభాగంలో మరో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్, అధ్యక్షులు వి.శ్రీనుబాబు, కోశాధికారి

బిల్లా నీరజ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

ఇదేం తీరో...!

సాగు నీరివ్వలేదు... నీటి తీరువా చెల్లించాలంటున్నారు...

నీరు లేక చెత్తతో నిండిపోయిన పంట కాల్వలు

ప్రజాశక్తి - నందిగామ : పంటలకు సాగు నీరివ్వకుండా రైతాంగ సమస్యలు పరిష్కరించకుండా, రైతులకు కావలసిన పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ, రెవెన్యూ అధికారులు నీటి తీరువా వసూళ్లలను గ్రామాల్లో ప్రారంభించడం పట్ల రైతుల నుండి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నందిగామ ప్రాంతంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కంచెల - ఏటూరు మేజర్ కాల్వలు మైనర్ కాల్వలు మరమ్మతులు నోచుకోక కంప దట్టంగా పెరిగిపోయింది. తొలకరి ప్రారంభమైనప్పటికీ సాగర కాలవల ద్వారా చుక్క నీరు కిందకు రావడం లేదు. నందిగామ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాల నిర్వహణ పూర్తిగా నిర్వీర్యానికి గురైంది. ముఖ్యంగా వేదాద్రి - కంచల ఎత్తిపోతల పథకం మూలపడి ఏడు సంవత్సరాలు దాటినప్పటికీ ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి మరమ్మతులకు కేటాయించలేదు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నందిగామ పర్యటనకు వచ్చిన సందర్భంగా వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మత్తులకు రూ. 18 కోట్లు మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు కాలేదు. దీంతో నందిగామ ప్రాంతంలో రైతాంగం సాగునీరు రాక పత్తి, మిర్చి, మాగాణి పంటలు ఎండిపోతున్నాయి. ఈ తరుణంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహించారు .నీటి సంఘాల అధ్యక్షులు ఎన్నికై పదవీ బాధ్యతలు తీసుకున్నప్పటికీ రైతాంగానికి మేలు చేసింది ఏమీ లేదు. ఒకపక్క ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు, పురుగుమందులు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు ఎరువులు పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. పంట కాలవల ద్వారా సాగునీరు సకాలంలో రానప్పటికీ భూములకు నీటి తీరువాను అధికారులు ఖరారు చేసి వసూలు చేయడం రైతుల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నందిగామ ప్రాంతంలో రెవిన్యూ సర్వే నెంబర్ల ద్వారా నీడ్ తీరువా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో విఆర్వోలు రైతులకు నోటిసు ఇస్తూ కట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మేజర్, మైనర్ కాలవలు ఆధారంగా నీటి వసతి ఉన్న భూములకు, నీటివసతి లేకపోయినప్పటికీ వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 16.46 లక్షలు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకొని 3.8 లక్షలు వసూలు చేశారు. గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న నీటి శిస్తు కూడా వడ్డీతో సహా రైతుల ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నారు. ఎన్ఎస్‌పి, మునేటి కాలువలు నీటి శిస్తు వరి పంటకు ఎకరానికి రూ.200, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర మెట్ట పంటలకు ఎకరానికి 100లు చొప్పున నీటి తీరువా వసూలు చేస్తున్నారు. గత ఏడాది చెల్లించకపోతే ఈ ఏడాది ఆరు శాతం వడ్డీ కలిపి వసూలు చేస్తున్నారు. నందిగామ మండలంలో నందిగామ రూ.1,87,550 నీటి తీరువా పెండింగ్ వుంది. మాగల్లు గ్రామంలో రూ.2,93,875లు, కొండూరులో రూ.4,991,248లు, రామిరెడ్డిపల్లి గ్రామంలో 55,401 దాములూరులో 69,970 సోమవారం గ్రామంలో 4,87672 అడవిరావులపాడు గ్రామంలో రూ.74 వేలు, పెద్దవరం గ్రామాల్లో 54,001 చొప్పున నీటి తీరువ బకాయిలను అధికారులు వసూలు చేస్తున్నారు.

నందిగామ తహశీల్దార్ సురేష్ బాబు మాట్లాడుతూ నీటి తీరువా పాత బకాయిలు వడ్డీతో సహా రైతులు చెల్లించాలని పేర్కొన్నారు. వసూలు అయిన నీటి తీరువా నీటిపారుదల శాఖ ఓ అండ్ ఎం ఖాతాకు జమ చేస్తామని వసూలు చేసిన సొమ్ముతో కాల్వల మరమ్మతులకు ఖర్చు పెడతామని కావున వీఆర్వోలు రైతులు సహకరించి సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.